andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.3 కనిష్ఠం 27.6



నిర్మల్

జిల్లా వార్తలు

8

గురువారం 9 మే 2024

విద్యాశాఖ కమిషనర్‌పై చర్య తీసుకోవాలి : జాక్టో

నిర్మల్ కల్చరల్, మే 5 : టెట్ పరీక్ష ఉపాధ్యాయుల పదోన్నతికి వివాదంగా మారిందని దీనికి కారణమైన విద్యాశాఖ కమిషనర్‌పై చర్య తీసుకోవాలని ఉపాధ్యాయ జాక్టో డిమాండ్ చేసింది. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో నాయకులు పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ క్లారిఫికేషన్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఎస్. భూమన్న యాదవ్, డి.శంకర్, ఏ.విజయ్‌కుమార్, ఎస్. మహేంద్రచారి తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణ కత్తి మీద సాము



ఆశిష్ సంగ్వాన్, జిల్లా కలెక్టర్

- డ్యూటీలపైనే అధికారుల ఫోకస్
- జిల్లాలో ప్రతీరోజు సమీక్షలతో కలెక్టర్ దిశా నిర్దేశం
- ఇప్పటికే వందమందికి పైగా ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు
- డ్యూటీలు తప్పనిసరిగా నిర్వహించాలంటూ హెచ్చరికలు
- విద్యాశాఖ మినహా ఇతర అన్ని శాఖలకు రాత్రింబవళ్లు పనులు

నిర్మల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో రాజకీయ ప్రాబల్యం ఎక్కువగా ఉండడంతో ఇక్కడ ఎన్నికల నిర్వహణ అధికార యంత్రాంగానికి కత్తిమీద సాములా ఉంటుందన్నది బహిరంగ రహస్యమే. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఈ సారి ఎక్కడ కూడా చిన్న అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ జానకీషర్మిలతో కలిసి రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. అలాగే ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా స్వీప్ ఆధ్వర్యంలో ఆయన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2కే ర్యాలీల పేరిట ఆయన అందరిని అప్రమత్తం చేస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌లు తదితరులంతా ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 85 సంవత్సరాలకు పైబడిన వృద్ధులకు, వికలాంగులు మొత్తం 636 మందికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించారు. ఇలా ఓ వైపు ఓటింగ్‌పై అవగాహన పెంపొందిస్తూనే ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహించారు. అయితే ఎన్నికల విధులు కేటాయింపబడిన వారంతా తప్పనిసరిగా విధుల్లో పాల్గొనే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలకు హాజరు కాని ఉద్యోగులందరికీ జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేయడమే కాకుండా గైర్హాజరీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. దీనికి తోడుగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అపశృతులు తలెత్తకుండా కలెక్టర్ ముందస్తు చర్యలు చేపట్టారు. ఉష్ణోగ్రత తీవ్రతలు పతాకస్థాయిలో ఉన్న కారణంగా పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్ల కోసం అవసరమైన టెంట్లు, తాగునీటి సౌకర్యం కూడా కల్పించనున్నారు. వంద శాతం వెబ్‌కాస్టింగ్‌కు కూడా చర్యలు చేపట్టబోతున్నారు. మూడు నియోజకవర్గాల్లో మొత్తం 7,036,642 మంది ఓటర్లు మొదట్లో నమోదై ఉన్నారు. కాగా నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో 667 ప్రాంతాల పరిధిలో 925 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా భద్రత చర్యల కోసం ప్రత్యేక బలగాలను జిల్లాకు రప్పిస్తున్నారు. 289 మంది సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేశారు. ముఖ్యంగా ఎన్నికల డ్యూటీలకు సంబంధించిన విధులను జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డికి నోడల్ అధికారి రూపంలో అప్పగించారు. దీంతో ఆయన ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణలు లాంటి అంశాలపై ప్రతీరోజూ సమీక్షలు నిర్వహిస్తూ కలెక్టర్‌కు నివేదికలు అందిస్తున్నారు. ఎక్కడ కూడా ఉద్యోగుల కొరత ఉండకుండా అదనంగా 20శాతం మంది ఉద్యోగులను నియమించారు. దీంతో ఎన్నికల విధులను నిర్వహించే వారి సంఖ్య మిగులుబాటు ఉండే విధంగా చూస్తున్నారు.

ఎలక్షన్ డ్యూటీలపైనే నజర్

ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్‌తో పాటు మ్యాన్ పవర్ నోడల్ అధికారి, జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డిలు ఎన్నికల డ్యూటీలపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతీరోజూ ఉద్యోగులకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించి గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు సైతం జారీ చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా డ్యూటీలు చేసే ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎలక్షన్ డ్యూటీలు చేసే వారికి తగిన సౌకర్యాలు కల్పించాలంటూ వినతి పత్రాలు అందించారు. ఈ వినతిపత్రాలపై కలెక్టర్ స్పందిస్తూ అన్ని పోలింగ్‌కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్ సౌకర్యాన్ని సమకూరుస్తున్నారు. అలాగే తాగునీరు సౌకర్యం కూడా అందుబాటులో ఉంచనున్నారు. రవాణా సౌకర్యాన్ని కూడా మెరుగు పర్చే విధంగా చర్యలు చేపడుతున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి..

జిల్లాలోని పలు సమస్యాత్మక గ్రామాలపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా కడెం, ఖానాపూర్, పెంబి, కుబీర్, దస్తూరాబాద్ లాంటి మండలాల్లో మారుమూల గ్రామాలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ యంత్రాంగానికి ప్రతీయేటా సవాలుగా మారుతోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డిలు ఎన్నికల విధులను నిర్వహించే ఉద్యోగులపై పకడ్బందీగా దృష్టి సారించారు. దీంతో ఎక్కడ కూడా ఎలాంటి సమస్య ఉత్పన్నం కాలేదు.

గంట పోలింగ్ సమయం పెరిగింది

సాయంత్రం 6గంటల వరకు ఎన్నికల నిర్వహించాల్సి ఉండగా ఈ సారి గడువును 7గంటల వరకు పెంచారు. దీంతో పోలింగ్ ప్రక్రియ ఓ గంట ఎక్కువగా కొనసాగనుంది.

అంతా కలెక్టర్ డైరెక్షన్‌లో..

ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలను సైతం పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయన ఉదయం నుంచి రాత్రి వరకు శ్రమిస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలు, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి వాతావరణంలో మార్పులు ఉన్న కారణంగా ఆయన ఆ కోణంతోనే ఎన్నికల నిర్వహణను విజయవంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటిపోతున్న కారణంగా ఎండలు మండిపోతున్నాయి. వేడి తీవ్రత, ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 11 గంటలు దాటితే ఇంటి బయటకు వెళ్ళేందుకు జంకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కలెక్టర్ అన్ని తానై ముందుకు నడిపిస్తూ పోలింగ్ శాతం పెంచేందు కోసం ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎక్కడ కూడా లోపా లు తలెత్తకుండా కలెక్టర్ సుడిగాలి పర్యటనలు జరుపుతూ రాత్రి వేళల్లో పనుల ప్రగతిపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఏ నిమిషంలో కలెక్టర్ మాట్లాడాతారోనన్న భయంతో ఉద్యోగులంతా ఉన్నారు. అయితే కలెక్టర్ శిక్షణ కార్యక్రమాలకు హాజరు కాని ఉద్యోగులందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసి ముందస్తు హెచ్చరికలను పంపారంటున్నారు. మొత్తానికి ఎన్నికల విధుల వ్యవహారంపైనే ఇటు కలెక్టర్ అటు డీఈవోలు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. డ్యూటీలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలకు హాజరుకాని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తాఖీదులు జారీ చేయడంతో వారంతా హడలెత్తిపోతున్నారు. దీంతో ఉద్యోగులంతా విధి నిర్వహణపట్ల శ్రద్ధ చూపుతున్నారు. పలు ఉపాధ్యాయసంఘాలు చేస్తున్న విన్నపాలు, సూచనలు పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎస్పీతో చర్చించి బందోబస్తు చేపడుతున్నారు.





అప్పటి జిల్లా కలెక్టర్
ముషారఫ్‌కు నెల రోజుల జైలు



ముషారఫ్ ఆలీ ఫారూఖీ, అప్పటి జిల్లా కలెక్టర్

నిర్మల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : గతంలో జిల్లా కలెక్టర్‌గా వ్యవహరించిన ముషారఫ్ ఆలీ ఫారూఖీకి రాష్ట్ర హైకోర్టు ఒక నెల జైలుశిక్షను విధిస్తూ తీర్పునివ్వడం కలకలం సృష్టిస్తోంది. అప్పటి కలెక్టర్ ముషారఫ్ ఆలీ ఫారూఖీకి నెల రోజుల జైలు శిక్ష విధించగా మున్సిపల్ కమిషనర్‌కు 15 రోజుల పాటు శిక్షను హైకోర్టు విధించింది. కాగా నిర్మల్ మున్సిపాలిటీలో 44 మంది ఉద్యోగుల నియమాకాలు, వేతనాల చెల్లింపుకు సంబందించి ముషారఫ్ ఆలీ ఫారూఖీ కోర్టు ఉత్తర్వులను ధిక్కరించారన్న అభియోగాలున్నాయి. ఈ అభియోగాలపై హైకోర్టు జడ్జీ మాధవి దేవి విచారణ జరిపి ఈ తీర్పును వెలువరించారు. కాగా మున్సిపల్ ఉద్యోగి సయ్యద్ శాకీర్ హైమద్ అనే 43 యేళ్ళ వ్యక్తి ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. అయితే మున్సిపల్ ఉద్యోగాలు పొందిన 44 మంది ఉద్యోగులకు వేతనాలను చెల్లించాలంటూ రాష్ట్ర హైకోర్టు తీర్పునివ్వగా ఆ తీర్పుపై అటు ముషారఫ్ ఆలీ ఫారూఖీ, మున్సిపల్ కమిషన్‌లు ఇద్దరు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రాష్ట్ర హైకోర్టు వీరిద్దరి వ్యవహారంపై సీరియస్‌గా విచారణ జరిపి తుది తీర్పును బుధవారం ప్రకటించింది.

అయోధ్య రాముడిని అవమానిస్తే
గాంధీభవన్ గడీలు బద్దలు కొడతాం

- కాంగ్రెస్ పార్టీకి బజరంగ్ దళ్ హెచ్చరిక
- ఖానాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఖానాపూర్ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

ఖానాపూర్, మే 8 : అయోధ్య రాముడిని అవమానించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మాట్లాడితే గాంధీభవన్ గడీలు బద్దలు కొడతామని బజరంగ్ దళ్ నిర్మల్ జిల్లా శాఖ హెచ్చరించింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయోధ్య పూజిత అక్షింతలపై అవమానించేలా వ్యాఖ్యలు చేశాని బుధవారం బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ నిర్మల్ జిల్లా సంయోజక్ కాశవేణి ప్రణయ్ మాట్లాడుతూ... అయోధ్య రాముడిని, హిందూ మతాన్ని అవమానించేలా చేస్తే సహించేది లేదన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయండి

లక్ష్మణచాంద, మే 8 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావ్ గురువారం సాయంత్రం 7:30 గంటలకు నిర్వహించే నిర్మల్ రోడ్ షోను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్మల్‌లోని మంచిర్యాల్ చౌరస్తా, శివాజీ చౌక్ వద్దకు సకాలంలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నిరంతరం జరగాలి : కలెక్టర్



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 8 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిరంతరం కొనసాగాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. అవసరమైన చోట్ల ధాన్యం మిల్లులకు తరలించేందుకు అదనపు లారీ లను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. ఇబ్బందులు కలుగకుండా టార్పాలిన్లు, టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. యంత్రాల ద్వారా ధాన్యం శుభ్రపరిచేలా చూడాలని, క్షేత్రస్థాయిలో కేంద్రాలు పరిశీలించి రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సీఎంఆర్ బియ్యం సరఫరా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఎస్‌వో నందిత, శ్రీకళ, డీఏవో అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వక్, తదితరులు పాల్గొన్నారు.

13న వేతనంతో కూడిన సెలవు

ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విద్యాశాఖ, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సెలవు రోజును సద్వినియోగం చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

తూకం లేటుగా వేస్తున్నారని రాస్తారోకో

- లారీలు రావడంలో తీవ్రజాప్యం
- క్వింటాల్‌కు 5 కేజీలు అదనంగా తూకం వేస్తున్నారని రైతుల ఆరోపణ



రోడ్డుపై ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న చామన్‌పెల్లి రైతులు

లక్ష్మణచాంద, మే 8 : లారీలు సమయానికి రావటం లేదని, సకాలంలో తూకం వేయటం లేదని మండలంలోని చామన్‌పెల్లి గ్రామ రైతులు బుధవారం ధర్నా చేసి రాస్తారోకో నిర్వహించారు. అంతేకాకుండా ఒక్కో క్వింటాల్‌కు 5 కేజీలు అదనంగా జోకుతున్నారని (తూకం) దీని వలన తరుగు ఎక్కువగా వచ్చి రైతులంతా వేలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. ఈ ధర్నా, రాస్తారోకో వలన ఆర్టీసీ బస్సుతో పాటు ఇతర వాహనాలు రోడ్డుపై నిలిచి పోయాయి. లారీలు త్వరగా వచ్చేలా చూడాలని, వెంటవెంటనే తూకం వేయాలని, అదనంగా తూకం వేయటం ఆపాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసిన సంబంధిత అధికారి రవీందర్ రెడ్డి, ఎస్సై సల్లా శ్రీనివాస్‌లు సంఘటన స్థలానికి వచ్చి లారీలు పంపేలా ఏర్పాటు చేసి రైతులను శాంతింపజేశారు. ఈ ధర్నాలో చామన్‌పెల్లి, చింతల్‌చందా, మునిపెల్లి రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేవాలయాల్లో సరుకుల కొనుగోళ్ల టెండర్ల రద్దు

- ఎలక్షన్ కోడ్ తర్వాత మళ్లీ టెండర్లు
- సరుకుల కొనుగోళ్ల కోసం కొత్త పాలసీ
- రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంత్‌రావు నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాసర, మే, 8 : దేవాదాయశాఖ పరిధిలో గల రాష్ట్రవ్యాప్తంగా సరుకుల కొనుగోలు కోసం నిర్వహించి పాత టెండర్లన్నింటిని రద్దు చేయాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. బుధవారం హైదరాబాద్ బొగ్గులకుంటలో దేవాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయంలో అన్ని దేవాలయాల ఈవోలతో సమావేశం జరిగింది. రెవెన్యూ (ఎండోమెంట్) ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంత్‌రావు, అదనపు కమిషనర్‌లు కృష్ణవేణి, జ్యోతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కేవలం రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో సరుకుల కొనుగోళ్ల విధానం గురించే దాదాపు మూడు గంటల పాటు చర్చించారు. గత నెల మార్చి 31వ తేదిన ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో దేవాలయాల్లో సరుకుల కొనుగోళ్ల అవకతవకలపై 'బాసరలో భోంచేస్తున్నారు' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఒకే వ్యాపారి గత కొన్నేళ్ల నుండి అన్ని ఆలయాలకు సరుకులు అధిక ధరకు సప్లయ్ చేస్తున్న విషయం, సదరు వ్యాపారికి సహకరిస్తున్న ఆయా దేవాలయాల అధికారుల గురించి సమావేశంలో చ ర్చించారు. ఇక ముందు ఇలాంటి పొరపాట్లు లేకుండా కొత్త పాలసీ రూపొందించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పోటీ ఉండే విధంగా టెండరు నిబంధనలో రూ. 10 కోట్ల టర్నోవర్‌ను తొలగించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సూచించారు. రూ. 10 కోట్ల కంటే తక్కువ విలువ సరుకులు కొనుగోలు చేసినప్పటికి టెండరులో మాత్రం అంతా టర్నోవర్ నిబంధన ఎందుకు విధించారని ఆలయాల అధికారులకు ప్రశ్నించినట్లు తెలిసింది. టెండర్లు సులభతరం చేసి మార్కెట్ విలువ ప్రకారం సరుకుల ధరలు ఉండాలని ఆదేశించారు. ప్రస్తుత కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వడమే గాకుండా ఆయన కాంట్రాక్టుల న్నింటిని రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత కొత్త టెండర్లు పిలుస్తామని, పాత పద్దతిని తొలగిస్తామని దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి ఆంధ్రజ్యోతితో చెప్పారు.



సమీక్షా సమావేశంలో రెవెన్యూ (ఎండోమెంట్) ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంత్‌రావు.. సమావేశానికి హాజరైన వివిధ దేవస్థాన అధికారులు

సంక్షిప్త సమాచారం

అంబేద్కర్ స్టడీ సర్కిల్‌కు
స్థలం కేటాయించండి

- ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం



నిర్మల్ కల్చరల్, మే 8 : నిర్మల్ పట్టణ కేంద్రం దివ్యనగర్‌లోని హరిహర క్షేత్రం సమీపంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసేందుకు కేటాయించాలని బుధవారం దళిత సంఘాల నాయకులు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అంద జేశారు. అంబేద్కర్ యూత్ నాయకులు బి. రంజిత్ కుమార్, నవీన్, మాల మహానాడు నాయకుడు కే. గణేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నిర్మల్ కల్చరల్, మే 8 : నిర్మల్ జిల్లాలో బుధవారం 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే రెండు రోజులు ఉష్ణోగ్రతలు అధికంగానే ఉండనున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేయాలి

సారంగాపూర్, మే 8 : మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిపోయే భక్తులు పేర్కొంటున్నారు. ఆలయం వద్దకు మొక్కులు తీర్చుకోవడానికి వచ్చేపోయే భక్తులు ఆలయం వద్ద తాగునీటి ఎద్దడి ఉండడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, ఆలయం వద్ద తాగునీటి ఎద్దడి లేకుండా ఉండడానికి ఆలయ పరిసర ప్రాంతాల్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

'అభివృద్ధిని చూసి ఓటు వేయండి'


సారంగాపూర్ మండలంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్, మే 8 : బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పార్టీకి ఓటు వేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మలక్ చించోలి, కౌట్ల(బి), వంజర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత పీఎం నరేంద్రమోదీకి దక్కిందన్నారు. నిరుపేదల కోసం ప్రతిరోజు ఉపాధి హామీ పథకంలో పని కల్పించడంతో పాటు వెంటది వెంటనే కూలీల డబ్బులను బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికలు రాగానే ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వస్తున్నారని, ప్రజలందరూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాటలు నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. జరగబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీని మూడోసారి దేశంలో అధికారంలోకి వచ్చేలా ప్రతీఒక్కరూ కృషి చేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ఆయన ఉపాధి హామీ కూలీలతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరిపే విలాస్ పాల్గొన్నారు.

వేసవిలో లోతు దుక్కుల వల్ల ఎన్నో ప్రయోజనాలు

● ఏరువాక, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు




ముథోల్, మే 8 : వేసవిలో రైతులు భూమిని లోతు వరకు దున్నడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని ఏరువాక, ముథోల్ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య, డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ కార్తీక్‌లు తెలిపారు. లోతు దుక్కుల వల్ల భూమి లోపలి పొరల్లో ఉండే క్రిమి కీటకాల కోషస్థ దశలు వరిలో వచ్చే కాండం కుళ్లు తెగుళ్లు, శిలీంద్ర బీజాలు, ఇతర శిలీంద్ర బీజాలు దీర్ఘకాలిక కలుపు మొక్కల వేళ్లు, దుంప వేళ్లు భూమిపైన పడటం వల్ల సూర్యరశ్మి తాకిడికి నిర్జీవమవుతాయన్నారు. అంతేకాకుండా భూములు గుల్లబారి తేమ, పోషకాలను గ్రహించి బెట్టను తట్టుకునే శక్తినిస్తాయన్నారు. లోతు దుక్కులు చేసేటప్పుడు వాలు ఉన్నట్లయితే దానికి అడ్డుగా దున్నడం వల్ల మట్టి కొట్టుకుపోకుండా వర్షపు నీటిని పూర్తిగా ఇంకేటట్లు చేస్తుందన్నారు. లోతు దుక్కి కోసం రెక్క నాగలి, పల్లెపు నాగలి, అలాగే సబ్ సాయిలర్ వంటి పరికరాలను ఉపయోగించాలని పేర్కొన్నారు. అలాగే వేసవికి ముందు పొలాల్లో పశువుల ఎరువులను చల్లుకోవాలి. అలాగే పశువులు, గొర్రెల మంద, కోళ్లను తిప్పడం ద్వారా అవి విసర్జించే వ్యర్థాల వల్ల భూమిలో సేంద్రియ ఎరువు తయారవడం ద్వారా భూసారం పెరిగి వచ్చే ఖరీఫ్‌లో మంచి దిగుబడిని ఆర్జించవచ్చని పేర్కొన్నారు. రైతులు ఇటువంటి ఉపయోగకరమైన పనులను ముందు జగ్రత్త చేసినట్లయితే పంట దిగుబడితో పాటు ఆర్థికంగా లబ్ధ పొందవచ్చని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

● నిర్మల్ డీఆర్‌డీవో విజయలక్ష్మీ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

కుంటాల, మే, 8: మండలంలోని లింబా (బీ) గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేపడుతున్న వరి ధాన్యం కేంద్రాన్ని బుధవారం డీఆర్‌డీవో విజయలక్ష్మీ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సరైన తేమ శాతంతో ధాన్యాన్ని తీసుకవచ్చి కేంద్రాల్లో విక్రయించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం లింబా (కే) గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండవేడిమి కారణంగా అదిక సంఖ్యలో ప్రజలు ఉదయం పూటనే ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు హక్కు విషయంలో ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఈమె వెంట ఎంపీడీవో రహీం, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్ తదితరులు ఉన్నారు.

ప్రాణహిత కడతాం.. ఆదిలాబాద్ రైతులకు సాగునీరిస్తాం

● ఓటమి భయంతో మోదీ మత వైషమ్యాలు ● పార్లమెంట్ ఎన్నికల్లో ఒకటైన బీఆర్ఎస్, బీజేపీ
● రైతు భరోసా రాకుండా రైతు వ్యతిరేక బీజేపీ, బీఆర్ఎస్‌ల కుట్ర
● తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు
● నిర్మల్ మీడియా సమావేశంలో వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నిర్మల్, మే8(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత కట్టి ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షితో కలిసి హాజరై మాట్లాడారు. మూడోసారి ప్రధాని అవుతానన్న ఆశలుపోయి ఓటమి భయంతో ప్రధానిమోదీ దేశంలో మత వైషా మ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఆత్రం సుగుణ విజయానికి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 13న పోలింగ్ జరగడానికి కేవలం 4రోజులు ఉన్న నేపథ్యంలో చాలాజాగ్రత్తగా పోల్ మేనేజ్మెంట్ నిర్వహించాలని పలు సూచనలు చేసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని మార్చాలని కుట్రచేస్తున్న బీజేపీకి ఓటు వేస్తే మనహక్కులు పోతాయన్నారు. ప్రజాస్వామ్యభారత రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియ ంతృత్వంతో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న మోదీ ఒకవైపు, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడి దేశంలో లౌకికవాదాన్ని ని లబెట్టాలని ప్రజల కోసం పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీ మరోవైపు ఈ ఎన్నికల సంగ్రామంలో నిలబడ్డారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జిల్లా రిజర్వేషన్లు తొలగించాలని కుట్ర చేస్తున్న మోదీకి ఈ ఎన్నికల్లో రాజ్యాంగ ప్రేమికులు ప్రజాస్వామికవాదులు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దేశ సంపదను బహుళ జాతి సమస్యలకు దారాదత్తం చేయాలనే దురాలోచనతో మోదీ మూడోసారి ప్రధాని కావాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కులు, దేశసంపద, రాజ్యాధికారంలో వారికి రావాల్సిన వాటా తూటా తప్పకుండా అమలు కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదని ఈ రెండూ పార్టీలు ఒకటేనని మరోసారి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రుజువైందన్నారు. బీఆర్ఎస్‌కు ఓటువేస్తే బీజేపీకి వేసినట్టే నని అన్నారు. పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చి అనేక ప్రజావ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు ఇచ్చిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తుచేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకరికొకరు గెలిపించుకో వడానికి ప్రయత్నం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ బలమున్నచోట బీజేపీ బలహీనమైన అభ్యర్థిని పోటీలో పెట్టగా బీజేపీ అభ్యర్థి బలమున్న చోట బీఆర్ఎస్ బలహీనమైన అభ్యర్థిని పోటీలో నిలిపిందని వివరించారు. దేశ సంపదను సంపన్నులకు వ్యాపారులకు దోచిపెట్టి బీజేపీ పార్టీ, రాష్ట్ర సంపదను దోపిడీ చేసిన బీఆర్ఎస్ పార్టీలు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చేతులు కలిపి మరోసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాయని ఈ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతుల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నాయన్నారు. రైతు భరోసా రాకుండా బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. రైతు భరోసా విషయంలో రైతులను తప్పుదోవ పట్టించే విధంగా ఈ రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఓబీసీ కుల గణన ద్వారా దేశ సంపద రాజ్యాధికారంలో జనాభా దమాషా ప్రకారం వారికి వాటా లభిస్తుందని రాహుల్ గాంధీ బీజేపీ పాలకులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలో కుల గణన మొదలు పెట్టామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలో కూడా కుల గణన కచ్చితంగా చేపట్టి జనాభా దమాషా ప్రకారంగా హక్కులు, సంపద కల్పిస్తామని వెల్లడించారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు నీళ్ల ఇవ్వకుండా ఆదిలాబాద్ ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయా ంలో ప్రారంభించిన ప్రాణహితను విస్మరించి కాళేశ్వరం నిర్మించి ఆదిలా బాద్ జిల్లా ప్రజలకు కష్టాలను చూపించిందని వివరించారు. ఎన్నికల తర్వాత ప్రాణహితను కచ్చితంగా నిర్మిస్తామని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఉన్న మేజర్ మీడియం మైనర్ సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన కాలువల పనులను కూడా పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాజెక్టులు, కాలువలను పూర్తి చేసి పంట పొలాలకు నీళ్ల ఇస్తామని చెప్పారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో భూములపై ఆదివాసి గిరిజనులకు ఉన్న హక్కులను ధరణి ద్వారా గత పాలకులు చిన్నాభిన్నం చేశారన్నారు. ట్రైబల్, నాన్ ట్రైబల్ ప్రజల భూ సమస్యలను పరిగణలోకి తీసుకొని వారికి త్వరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీడీఏలను బలోపేతం చేస్తూ 100శాతం నిధులు ఇచ్చి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. అకాల వర్షం, గాలి దుమారం వల్ల నష్టపోయిన రైతులను కచ్చితంగా ఆదుకుంటామని, పంట నష్టం అంచనా వేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, ఎన్నికల తర్వాత పరిహారం ఇస్తామన్నారు. అకాల వర్షంతో కల్లాల వద్ద, ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తామని వెల్లడించారు. ప్రశ్నించే గొంతుక ఆత్రం సుగుణను పార్లమెంట్ మెంబర్‌గా గెలిపించుకుంటే అమాయక గిరిజన ఆదివాసి ప్రజల గలాన్ని పార్లమెంట్‌లో వినిపించి వారి హక్కుల సాధనకై పోరాటం చేస్తుందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలంటే ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మంత్రి సీతక్క, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని శాసన సభ్యులు, మాజీ మంత్రులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారు : మంత్రి సీతక్క

లోకేశ్వరం, మే8: బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లను ఆ పార్టీ రద్దు చేస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రం లోకేశ్వరం లక్ష్మీ కళ్యాణ మండపంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీజేపీ నాయకత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకే ప్రజలు పట్టం కట్టాలని ఆమె కోరారు. అన్నివర్గాల సంక్షేమం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆగస్టు 15లోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. తూకం వేసిన వరి బస్తాల్లో కోత పెడుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో ప్రభుత్వమే కొంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి, వేణుగోపాల చారి, నారాయణ రావు పటేల్, విఠల్ రెడ్డి, లోక భూమారెడ్డి, మండల ఎంపీపీ లలిత భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే..

● రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలు మోసం గ్యారంటీలే ● ఖానాపూర్ రోడ్ షోలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


ఖానాపూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న రాజాసింగ్

ఖానాపూర్, మే 8: కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నా రు. బుధవారం ఖానాపూర్‌లో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా మందిరం ను ంచి బస్టాండ్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించా రు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించిన రోడ్‌షోకు భారీగా జనం తరలివచ్చారు. ఈ సం దర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ దేశంలో అబద్దాలు చెప్పే ముఖ్యమంత్రుల్లో నాడు కేసీఆర్ నెంబర్ వన్‌గా ఉండగా.. నేడు ఆ స్థానాన్ని రేవంత్‌రెడ్డి ఆక్రమించాడన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ వేరు కాదని ఆ రెండు పార్టీలు ఒకటేనన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలతో ప్రజలు మోసం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను తగ్గించి ముస్లింలకు ఇస్తున్న ఫోర్‌పర్సెంట్ రిజర్వేషన్ తొలగి స్తామని అమిత్‌షా చెబితే రేవంత్‌రెడ్డి ఆ వీడియో అర్థాన్నే పూర్తిగా మార్చేశారన్నారు. రోడ్‌షోలో పాల్గొన్నవారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు రితీష్ రాథోడ్ ఎంపీ అభ్యర్థి గెడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, అల్లాపూర్ శ్రీనివాస్, నాయకులున్నారు.

ధర్మం కోసం ఓటు వేయాలి

ఇచ్చోడ: ధర్మం కోసం బీజేపీ పార్టీని గెలిపించి ముచ్చటగా మూడోసారి దేశప్రధానిగా నరేంద్రమో దీని గెలిపించాలని ఆ పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బుధవారం రాత్రి ఇచ్చోడ మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన కార్నల్ మిటింగ్‌లో ఆయన ప్రసంగించారు. తెలంగాణలో 17 స్థానాల్లో 12స్థానాల్లో బీజేపీ గెలుస్తుందన్నారు. అందులో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఒకటి అన్నారు. తెలంగాణలో ఒక మో సగాడు కేసీఆర్ రాజ్యం తెలంగాణలో ఖత ం అయ్యిందంటే.. ఇంకొక రాజ్యం వచ్చింది. కాంగ్రెస్ రాజ్యం వస్తే హిందువులకు కష్టం అవుతుందని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్‌శంకర్, పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్, జిల్లాఅధ్యక్షుడు బ్రహ్మనంద్, నాయకులు ఉన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించని బీజేపీని చిత్తుగా ఓడించండి

● ఉపాధి హామీ క్రింద నెలకి 10 వేల రూపాయలు ఇస్తాం ● ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేస్తాం
● బైక్‌పై వెళ్లి ప్రచారం చేసిన సీతక్క

లక్ష్మణచాంద, మే 8 : ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించని బీజేపీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క బుధవారం పిలుపునిచ్చారు. బైక్‌పై ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున మండలంలోని వడ్యాల్, బాబాపూర్, రాచాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో జరిపిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 2006 లో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు అమలులోకి తెచ్చి చట్టం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. పేదలకు పని కల్పించే ఈ పథకంలో పని చేసే కూలీలకు మంచినీరు. టెంట్, ప్రాథమిక చికిత్స కిట్, ప్రయాణ భత్యం లాంటివి ఏవీ కూడా బీజేపీ ప్రభుత్వం చెల్లించకుండా కూలీలకు అన్యాయం చేస్తుందని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం ఈ కూలీలకు కనీసం రెండు వందల కూలీ కూడా చెల్లించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోజు కూలీ 400లకు పెంచుతామని తద్వారా నెల రోజులు పనిచేసిన కూలీకి 10 వేలకు పైగా వస్తాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ. 500లకే సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200ల యూనిట్ల లోపు ఉచితం ఇంటి కరెంట్, 10 లక్షల రూపాయల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేసిన ఘనత మా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. రిజర్వేషన్ పరిమితిని పెంచి అగ్రవర్ణ పేదలతో సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చారు. గతంలో ఏకకాలంలో 1 లక్ష రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రానున్న ఆగస్టు 15లోపు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని చెప్పారు. రైతు భరోసా డబ్బులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, అట్ల రామ్‌రెడ్డి, అట్ల రవీందర్ రెడ్డి, మేడి నారా గౌడ్, కోంఢ్ర నరేష్ రెడ్డి, పోతారెడ్డి, కమల్‌కోట రాజు, గురాల లింగారెడ్డి పాల్గొన్నారు.

జరభద్రం..!

● వినోదం.. కాకూడదు విషాదం.. ● ప్రాణాలు తీస్తున్న ఈత సరదా
● జాగ్రత్తలు పాటించాలి


ఈత కొడుతున్న చిన్నారులు

ఆసిఫాబాద్, మే 8: విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చాయి. దీంతోవారంతా తమ ఊళ్లకు వెళ్లి ఉత్సాహంగా గడపాలని అనుకుంటారు. సరదా కోసం మిత్రులతో కలిసి ఈతకు వెళ్లాలనుకుంటారు. చెరువులు, వాగులు, కాలువల్లో దూకి కేరింతలు కొట్టాలనుకుంటారు.

ఈత సరాదా పిల్లల ప్రాణాలను బలి తీసుకుంటుంది. ప్రాజెక్టులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్తున్నవారు విగతజీవులుగా మారి తల్లిదండ్రులకు గర్భకోశాన్ని మిగిలిస్తున్నారు. అవగాహన లేమితో ప్రాజెక్టులు, చెరువుల లోతును సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. నీటిలో పెరిగిన నాచు, మొక్కలు కాళ్లకు తగిలి నీటిలో ఊపిరాడక మృతి చెందుతున్నారు. పిల్లలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి..
-సత్యనారాయణ, వైద్యుడు, ఆసిఫాబాద్



తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను ఓ కంట కనిపెట్టి ఉండాలి. సాధ్యమైనంత వరకు స్నేహితులతో ఈతకు పంపకపోవడమే మంచిది. పిల్లలకు ఈత పై ఆసక్తి ఉంటే స్వయంగా స్వీయ పర్యవేక్షణలో నేర్పించాలి. ఈతకు వెళ్లి ప్రమాదానికి గురైతే బాధితుడిని ఒడ్డుకు చేర్చిన తర్వాత వెల్లకిలా పడుకోబెట్టాలి. అవసరమైతే కృత్రిమశ్వాస అందించాలి. ఛాతిపై చేతులతో ఒత్తాలి. దీనివల్ల శ్వాస పెరుగుతుంది. తర్వాత దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్లాలి.

పిల్లలను కనిపెట్టుకుని ఉండాలి..

అవగాహన లేమి, నీటి లోతు తెలియకపోవడం, వచ్చిరాని ఈత, స్నేహితుల మధ్య సరదాగా పెట్టుకునే పోటీలు చిన్నారుల మృత్యువుకు కారణమవుతున్నాయి. వేసవిసెలవుల్లో పిల్లలు ఎక్కువగా ఈతకు వెళ్లే అవకాశం ఉండటంతో పెద్దలు గమనించాలి. వేసవితాపం నుంచి ఉపశమనం కోసం చాలా మంది పిల్లలు ఈత కొట్టేందుకు వెళ్తుంటారు. బావులు, చెరువుల వద్దకు వెళ్తామంటే తల్లిదండ్రులు తిడతారనే భయంతో కొందరు చెప్పకుండానే స్నేహితులతో కలిసి ప్రమాదాల బారిన పడుతుంటారు. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఓకంట కనిపెట్టి ఉండాలి. ఇంటినుంచి బయటకువెళ్లే పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. స్నేహితులతో ఈతకు వెళ్లే ముందు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచించాలి. ఈతరాని పిల్లలపై మరింత జాగ్రత్తగావ్యవహరించాలి. ఎందుకంటే ఈత సరదా, తోటి మిత్రుల ప్రోత్సాహం వారిని నీటివైపు లాక్కుని పోతుంది. ఈతసరదా ఉన్న పిల్లల ఆసక్తిని గమ నించి తామే స్వయంగా స్వీయ పర్య వేక్షణలో నేర్పిం చడం మంచిది. సాధ్యమైనంత వరకు స్నేహితులతో ఈతకు పంపకపోవడమే మంచిది.

దూకేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి..

జలాశయాల్లో ఈత కొట్టేందుకు పైనుంచి దూకే సమయంలో కాళ్ల మొదటగా నీటిని తాకేలా చూసుకోవాలి. తలకిందులుగా దూకడం ప్రమాదకరం. క్వారీ గుంతల అడుగుభాగంలో బండలు, రాళ్లు ఉంటాయి. లోతును ముందుగానే అంచనా వేయకపోతే నీటమునిగే ప్రమాదం ఉంది. ఒకరిపై మరొకరు దూకితే పెద్ద ప్రమాదం జరుగుతుంది.

కూలీల సంఖ్యను పెంచాలి


కుంటాలలో ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో విజయలక్ష్మీ

కుంటాల, మే, 8 : ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీల సంఖ్యను మరింత పెంచాలని డీఆర్‌డీవో విజయలక్ష్మీ అన్నారు. బుధవారం మండల కేంద్రం కుంటాల లో నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత వారం రోజుల నుంచి మండలంలోని అన్ని గ్రామాలల్లో గత ఏడాది కాలంగా ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో చేపట్టిన పనులపై తనిఖీ సిబ్బంది సేకరించిన వివరాలను చదివి వివరించారు. ఉపాధి సిబ్బందితో బాధ్యతతో పనులు చేపట్టాలని, అక్రమాలకు తావులేకుండా పనిచేయా లని ఆమె పేర్కొన్నారు. సామాజిక తనిఖీలో భాగంగా సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఏపీవో నవీన్, ఎస్‌ఆర్‌పీ భగవంత్ రావు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్‌బూత్‌ను పరిశీలించిన నిర్మల్ డీపీవో


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీపీవో

భైంసా రూరల్, మే 8 : మండలంలోని వానల్‌పాడ్, వట్టోలి గ్రామాల్లో బుధ వారం పోలింగ్‌బూత్‌ను డీపీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ... పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఉండేటట్టు చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి రాజ్‌కుమార్, బీఎల్‌వో, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మే 8: జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద 2023 సంవత్సరానికి గాను సంత్ కబీర్, జాతీయ చేనేత అవార్డు కొరకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేత జౌళి దుస్తుల ఎగుమతి శాఖ సంచాలకుడు డాక్టర్ అలుగువర్షిణి ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అవార్డు కోసం నేత విభాగంలో విజేతలకు మూడు అంచెల ఎంపిక ద్వారా ఖరారు చేస్తామన్నారు. ఇతర వివరాలకు ఆన్‌లైన్‌లో www.handlooms.nic.inలో సంప్రదించాలన్నారు.

లోక్‌నాథ్ బాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కాగజ్‌నగర్, మే 8: కాగజ్‌నగర్ ఎఫ్‌కాలనీలోని లోక్‌నాథ్‌బాబా ఆలయంలో రెండవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పూజలుచేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దహెగాం, మే 8: నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని అయినం, చిన్నరాస్పెల్లి, దహెగాం, ఒడ్డుగూడ గ్రామాల్లో ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ నిలువల రిజిస్టర్‌ను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే రైతులకు రశీదులు అందజేయాలన్నారు. పత్తి, వరి, కంది విత్తనాలు విక్రయిస్తే రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎంఏవో వంశీకృష్ణ, ఏఈవోలు ఉన్నారు.

రైతులు అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, మే 8: అకాల వర్షాలతో రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దహెగాం మండలంలోని లగ్గాం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు టార్పాలిన్‌లు అందించాలన్నారు. ం

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్, మే 8: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం బీజేపీనాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం బూర్గుడలో నాయకులు, కార్యకర్తలతో కలిసిసమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట్నాక విజయ్, విశాల్, సుచిత్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు

సిర్పూర్(టి), మే 8: మండల కేంద్రంలోని కాగజ్‌నగర్- కౌటాల ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ప్రతిసారి వర్షం పడినప్పుడల్లా గుంతల్లో వర్షపునీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రహదారి గుండా అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రోడ్డు విషయాన్ని పట్టించుకోవడం లేదు.


గుంతలతో అధ్వానంగా ప్రధాన రహదారి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

జైనూర్, మే 8: మండలంలోని పోచంలొద్దిలో మంత్రి సీతక్క బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ఉయిక చందన్‌శావ్ అధ్వర్యంలో సుమారు 2వందలమంది బీఆర్ఎస్, ఆదివాసీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆత్రం సుగుణను నిండు మనసుతో ఆశీర్వదించి కాంగ్రెస్‌పార్టీ చేతిగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఉపాధి కూలి రూ.400

జైనూర్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు రోజుకు రూ.400 వేతనం ఇస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ అన్నారు. మండల కేంద్రం పరిసరాల్లో ఉపాధి కూలి పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే మొదట ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసిందన్నారు.

ఆంధ్రజ్యోతి

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.8 । కనిష్ఠం 24.7




ఆదిలాబాద్

జిల్లా వార్తలు

రెండో రోజు ప్రశాంతంగా ఎప్‌సెట్

మావల, మే 8 : అగ్రికల్చర్ కోర్సు ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ ప్రవేశపరీక్ష రెండోరోజు ప్రశాంతంగా కొనసాగింది. బుధవారం నిర్వహించిన ఎప్‌సెట్ పరీక్షకు వందమంది విద్యార్థులకు 95 మంది హాజరైనట్లు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



• విద్యుత్ సబ్‌స్టేషన్

- జిల్లాలో రికార్డుస్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- గిర్రున తిరుగుతున్న విద్యుత్ మీటర్లు
- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్తున్న అధికారులు
- అధికంగా నమోదయ్యే ప్రాంతాలపై విద్యుత్ శాఖ కార్యాచరణ
- నో పవర్ కట్ అనే నినాదంతో ముందుకు..
- ఓవర్‌లోడ్‌తో కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- పరిస్థితిని చక్కదిద్దేందుకు ఉరుకులు.. పరుగులు..

పవర్ ఫుల్ డిమాండ్!



ఆదిలాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో 45 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం భారీగా పెరిగిపోతోంది. దీంతో నిత్యం విద్యుత్ వినియోగానికి డిమాండ్ ఏర్పడుతోంది. ఏ కొద్ది సేపు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్ చివరి మాసం నాటికి 46.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ కోటాను జిల్లాకు కేటాయించగా 43.47 మిలయన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఈసారి ఏప్రిల్ మాసంలోనే ఎండల తీవ్రత మొదలుకావడంతో ఒక్కసారిగా విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎండలు మండిపోయే మే మాసంలో మరింత విపరీతమైన డిమాండ్ ఏర్పడుతోంది. దీంతో విద్యుత్ సరఫరాలో తరుచు అంతరాయం ఏర్పడుతోంది. మరమ్మతుల పేరిటా పలుమార్లు విద్యుత్ సరఫరాను నిలిపి వేయాల్సి వస్తోంది. జిల్లాలో లక్షా 97వేల 568 గృహవినియోగం విద్యుత్ కనెక్షన్లు ఉండగా 32వేల 89 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అలాగే క్యాటగిరి 2లో 16వేల 886 కనెక్షన్లు, చిన్న తరహా పరిశ్రమలకు 1139, విద్యుత్ దీపాల సర్వీసులు, ఇతరాత్ర కనెక్షన్లున్నాయి. ప్రస్తుతం యాసంగి పంటల సాగు పెద్దగా లేక పోయినా గృహవినియోగం భారీగా పెరిగిపోతోంది. వేసవి పరిస్థితుల నేపథ్యంలో నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.



• విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఉన్నత అధికారులు (ఫైల్)

రెండింతలవుతున్న కరెంటు బిల్లు..

జిల్లాలో ఇప్పటికే యాసంగి పంటల సీజన్ దాదాపుగా ముగిసింది. అక్కడక్కడ బోరుబావుల కింద కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. దీంతో వ్యవసాయానికి విద్యుత్ డిమాండ్ భారీగా తగ్గిపోయింది. అయితే జిల్లాలో మండిపోతున్న ఎండల తీవ్రతకు గృహవినియోగం అమాంతంగా పెరిగిపోయింది. దీంతో నెలవారి కరెంట్ బిల్లు రెండింతలవుతుందని వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వేసవితాపాన్ని తట్టుకునేందుకు కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీల వినియోగంతో విద్యుత్ మీటర్లు గిర్రున తిరగడంతో కరెంట్ బిల్లుల భారం పెరుగుతుంది. వేసవిలో బిల్లులు రెండింతలు కావడంతో అదనపు భారం పడుతోంది. నెలసరి వచ్చే బిల్లులను చూసి వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఎన్నడూ లేనివిధంగా బిల్లులు చేతికి రావడంతో ఆందోళనకు గురవుతున్నారు. నిరంతరంగా విద్యుత్‌ను సరఫరాచేయడంతో కూడా విద్యుత్ వినియోగం అధికమవుతుందని చెబుతున్నారు. విద్యుత్‌ను పొదుపుగానే వినియోగం చేయాలని లేని పక్షంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటున్నారు. ఉష్ణోగ్రతల తీవ్రత, ఈదురుగాలుల బీభత్సంతో తరుచూమొరాయిస్తున్న విద్యుత్ సరఫరాను చక్కదిద్దేందుకు అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

అధికారులకు సవాల్..

వేసవి పరిస్థితుల నేపథ్యంలో నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేయడం విద్యుత్ శాఖ అధికారులకు సవాల్‌గా మారుతోంది. వేసవి పరిస్థితులను అధిగమించి వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతీయేటా వేసవిలో సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌ను చేపడుతారు. ఇందులో భాగంగానే 11కేవీ, 33కేవీ లైన్లలో లోపాలను గుర్తించి మరమ్మతులను చేపట్టడం, సబ్‌స్టేషన్ల నిర్వహణ, కొమ్మకొట్టడం, వంగిన స్థంబాలను నిలబెట్టడం, కొత్త పోల్లను వేయడం, లూజు వైర్లను సరి చేయడంలాంటి పనులను చేపట్టాల్సి ఉంటుంది. కాని జిల్లాలో విపరీతంగా మండిపోతున్న ఎండలకు ఎలాంటి మరమ్మతు పనులను చేపట్టలేకపోతున్నారు. ఒకవేళ మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరాను నిలిపివేసిన భరించలేని ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరై విద్యుత్ శాఖ అధికారుల పై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సకాలంలో పూర్తిచేయాల్సిన సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌కు అడుగడుగునా ఆటంకాలే ఏర్పడుతున్నాయి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. మరో పక్షం రోజుల్లో వర్షాలు కురిస్తే ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఈదురుగాలుల బీభత్సానికి విద్యుత్ సరఫరాలో తీవ్రఅంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. గాలివానతో చెట్లు విరిగిపడితే విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేయడం కష్టంగానే కనిపిస్తోంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌ను యుద్ధప్రాతిపదిన పూర్తి చేస్తేనే విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అధిగమించవచ్చు.

మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

వేసవిలో ఎండల తీవ్రతకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయిస్తున్నాయి. ఉష్ణోగ్రతల తీవ్రతకు వేడెక్కిపోయి కాలిపోవడం జరుగుతోంది. దీనికి తోడుఓవర్‌లోడ్ భారం పెరిగిపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. తరుచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాల్సి వస్తోంది. ఎండల తీవ్రతకు మరమ్మతులు కూడా సకాలంలో జరుగడం లేదు. దీంతో విద్యుత్ సిబ్బంది ఏమీ చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రోజుల తరబడి కాలయాపన చేయకుండా చర్యలు చేపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో అరిగిపోయిన జంపర్లను సరిచేస్తున్నారు. ఓవర్‌లోడ్ అయిన ట్రాన్స్‌ఫార్మర్లను ఎర్త్‌పిట్లకు నీరు పోయడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్‌ను పునరుద్ధరిస్తున్నారు. జిల్లాకేంద్రంలో ఇటీవల 17 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వేసవిలో తలెత్తె లోడ్ సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పరిమితికి మించి కనెక్షన్లు పెరిగి పోవడం కూడా ఈ సమస్యకు కారణమంటున్నారు. ఎండల తీవ్రతకు ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల వాడకంతో గృహ వినియోగం కూడా విపరీతంగా పెరిగి పోతుంది. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరుచూ మొరాయించడంతో మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం..



• జేఆర్ చౌహాన్ (విద్యుత్ శాఖ ఎస్‌ఈ)

వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌ను చేపట్టి లోపాలను గుర్తిస్తున్నాం. ముఖ్యంగా ఓవర్‌లోడ్‌ను గుర్తించి అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ అంతరాయంపై ఆదిలాబాద్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశాం. ప్రస్తుతం నిరంతరంగా విద్యుత్‌ను అందిస్తున్నాం. ఏదైనా సమస్యలు ఏర్పడితే 9440811700కు సంప్రదించవచ్చు.

సంక్షిప్త సమాచారం



ఎన్నికల సిబ్బంది 10లోపు ఓటు వేయొచ్చు: కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, మే 8: పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎన్నికల సిబ్బంది కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని మరోరెండు రోజుల గడువు పెంచిందని కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజార్షిషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎఫ్‌సీ ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు ఈనెల 8 వరకు గడువు ఉండగా మే 10 వరకు పెంచినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసుకోవచ్చని తెలిపారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు డీఎస్పీ పోరాటం

• జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్‌మహరాజ్

ఆదిలాబాద్ అర్బన్, మే 8: భారత రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఒకవైపు, భారత రాజ్యాంగాన్ని రక్షించే పార్టీ ఒక వైపుగా ధర్మ సమాజ్ పార్టీ పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రక్షించేది దేశంలో డీఎస్పీ పార్టీ మాత్రమే అని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామని అగ్రకుల పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మాట్లాడుతూ కొన్ని ప్రత్యక్షంగా మరికొన్ని పరోక్షంగా మాట్లాడు తున్నారని పేర్కొన్నారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని రక్షించేది తామేనని అన్నారు. ఏళ్లుగా అగ్రకుల పార్టీలు దోపిడీ చేస్తూ ప్రజలను పట్టించుకోలేదని, అందుకే అణగారినవర్గాల పక్షాన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా మేస్రంగంగాదేవిని బరిలో ఉంచినట్లు తెలిపారు.

ఖానాపూర్ ఎమ్మెల్యేను కలిసిన పలువురు నాయకులు

ఉట్నూర్, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ తెలంగాణ డైరీచైర్మన్ లోకభూమారెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీ ఎన్నికల్లో తీసుకోవాల్సిన కార్యచరణపై చర్చించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన లోక భూమారెడ్డి



మధ్యాహ్న సమయంలో నిర్మానుషంగా రోడ్లు



ఎండా.. వానా!

• జిల్లాలో 43.8 ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పగలంతా ఎండలు దంచికొట్టి.. సాయంత్రం వేళల్లో మబ్బులు ఏర్పడి అకస్మాత్తుగా వర్షపు జల్లులు కురుస్తున్నాయి. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 43.8 డిగ్రీలు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 24.7 డిగ్రీలుగా నమోదైంది. ఉదయం నుంచి బానుడి భగభగలకు జనం బయటకు వచ్చేందుకే జంకిపోతున్నారు. ఎండల తీవ్రతకు వడదెబ్బ భారీన పడుతున్నారు. వడదెబ్బ భారీన పడి ఇప్పటికే ఒకరిద్దరు మరణించిన సంఘటనలు ఉన్నాయి. అత్యధికంగా బేలలో 43.5 డిగ్రీలు నమోదు కాగా, సిరికొండలో 42.8, నేరడిగొండలో 42.2, జైనత్‌లో 41.5, తాంసిలో 40.8, ఆదిలాబాద్ అర్బన్‌లో 40.2 డిగ్రీలు నమోదయ్యాయి. ఇచ్చోడ, నార్నూర్, గాదిగూడ, తలమడుగు, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, ఉట్నూర్ మండలం వ్యాప్తంగా 40 డిగ్రీల లోపే నమోదయ్యాయి. 24గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు కురవడంతో వాతావరణం కొంత చల్లబడినట్లే కన్పిస్తోంది.

మెప్మా ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

ఆదిలాబాద్ అర్బన్, మే 8: మెప్మా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మీవాడ, జైజవాన్‌నగర్, తాటిగూడ, భాగ్యనగర్, క్రాంతినగర్ వార్డులలో బుధవారం ఓటుహక్కుపై అవగాహనా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆటపాట ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది టీఎంసీ భాగ్యలక్ష్మి, సీవో పన్నాలాల్, సీవో సందీప్‌రెడ్డి, ఆర్పీలు, మహిళా సంఘాలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఓటు పై అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది



ఓటుహక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

ఓటు హక్కును వినియోగించుకున్న సర్వీస్ ఉద్యోగులు

ఉట్నూర్, మే8: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ విధులకు హాజరవుతున్న సర్వీస్ ఉద్యోగులు ముందస్తుగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలకేంద్రంలోని సహాయ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లలో ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన ఉద్యోగులు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగులకు ఎక్కడికక్కడే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించకుండా ముందస్తుగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆదేశాలు రావడంతో తాము దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బందులు పాలవుతున్నాయని ఉద్యోగులు వాపోయారు. ఖానాపూర్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు ఉట్నూర్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 2,24,523మంది ఓటర్లు ఉండగా 1951మంది ఉద్యోగులు ఓటుహక్కు కలిగి ఉన్నారు. 195 మంది వృద్ధ ఓటర్లు ఉండగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునేలా చూడడంతో 189 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారని ఎన్నికలసహాయ అధికారి తెలిపారు. ఉద్యోగులకు చెందిన 1951మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉండగా ఎన్నికల కమిషన్ మరోరెండు రోజులు పోలింగ్ అవకాశం కల్పించిందని సహాయ ఎన్నికల అధికారి తెలిపారు.

ఘనంగా వరల్డ్ రెడ్‌క్రాస్ డే

ఆదిలాబాద్ అర్బన్, మే 8: వరల్డ్ రెడ్‌క్రాస్ డే, సికిల్‌సెల్ దినోత్సవాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఫౌండర్ జాన్ హెన్రీడునంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ బాలశంకర్‌కృష్ణ, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు సామల ప్రశాంత్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ స్థాపించి 102 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రక్తదానం ఆవశ్యకతను తెలియజేస్తూ సమాజాన్ని చైతన్యం పర్చినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనత, సికిల్‌సెల్ అనేమియతో బాధపడుతున్న ఎందరికో బ్లడ్‌క్యాంప్స్ ఏర్పాటుచేసి ఆదుకోవడంలో రెడ్‌క్రాస్ కీలకపాత్ర పోషించిందన్నారు. అలాగే అనాథ శవాలకు అంతిమక్రియలు, వికలాంగులకు వృద్ధులకు కరోనా సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎందరికో తనదైన శైలీలో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు, జిల్లా సమన్వయకర్తలు ప్రపుల్‌వజే, బండారిదేవన్న, చరణ్‌గౌడ్, దొంతుల ప్రవీణ్, యువజన సంఘాల సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జాన్‌హెన్రీడునంట్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సభ్యులు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా



శిక్షణలో పాల్గొన్న మైక్రో అబ్జర్వర్లు

పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకే మైక్రో అబ్జర్వర్లు

• మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా, సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్

ఆదిలాబాద్ అర్బన్, మే8: పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించేందుకే మైక్రో అబ్జర్వర్లను నియమించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ తెలిపారు. మైక్రో అబ్జర్వర్ల శిక్షణను స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రాజార్షిషా, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ మైక్రో అబ్జర్వర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల రోజు పోలింగ్‌ప్రక్రియ సజావుగా సునిశితంగా పరిశీలించడానికి మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. మాక్ పోల్ నిర్వహణ, పోలింగ్ కేంద్రాల దారులు,మాక్‌పోల్ అనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరగుతున్నాయా లేదా నిశిత పరిశీలన చేయాలని సూచించారు. ఈ అంశాలపై జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాట్లు, ప్రతిది పరిశీలించాలని ఎక్కడైనా సాంకేతిక లోపాలతో ఈవీఎంలు పనిచేయకపోతే వాటిస్థానంలో వేరే ఈవీఎంలు ఎలా అమరుస్తున్నారో పరిశీలించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌జరిగేలా చూడాలని, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణలో అన్నిఅంశాలపై అవగాహన కల్పించి పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. అలాగే పోలింగ్‌కు సంబంధించిన నివేదికలను సకాలంలో ఎప్పటికప్పుడు పంపాలని, మాక్‌పోల్ ఉదయం 5.30కు ఏజెంట్ల సమక్షంలో నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వహిస్తున్న విధులు, టెండర్, చాలెంజ్ ఓటింగులు జరిగితే వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ బుధవారం నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన 190 మంది మైక్రో అబ్జర్వర్లను అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పారదర్శకంగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నడిచేలా మైక్రో అబ్జర్వర్లను క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలని తెలిపారు. అనెగ్జర్-28 ప్రకారం18 అంశాలకు చెందిన వాటిపై ఎప్పటికప్పుడు నివేదికలు జనరల్ అబ్జర్వర్‌కు నేరుగా పంపాలని సూచించారు. మాక్‌పోల్, ఈవీఎం యంత్రాల సీల్, అభ్యర్థికి సంబంధించిన పోలింగ్ ఏజెంట్ల వివరాలు, 17-ఏ రిజిస్టర్ నిర్వహణ, పోల్ పూర్తయ్యేంత వరకు జరిగే ప్రక్రియపై నివేదికలు ఇవ్వాలని, ఎన్నికల నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ ఎలా సాగుతున్నదిగమనించడమే మైక్రో అబ్జర్వర్ల కీలక పాత్రని, శిక్షణను శ్రద్ధగా విని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. మాస్టర్‌ట్రైనర్ లక్ష్మణ్ శిక్షణనిచ్చారు.